సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 13 । జనవరి । 2025



అందరికీ సభ్యత్వం ఉండేలా

గ్రామాల్లో ప్రతీ మహిళ పొదుపు సంఘాల్లో సభ్యత్వం కలిగి ఉండేలా సెర్ప్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 31° / 17°

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. రాత్రికి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి, క్యూ లైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, భక్తులు ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారితో తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానికి పోటెత్తిన పర్యాటకులు

ఒకరోజు ఆదాయం రూ.50,110



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఆదివారం కిన్నెరసానికి పర్యాటకులు పోటెత్తారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 764 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.27,110 ఆదాయం లభించగా, 300 మంది బోట్ షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.23,000 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ లభించగా ఈనెల 10న హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో అందజేశారని ప్రధానోపాధ్యాయుడు ప్రభుదయాళ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పనితీరు ఆధారంగా పాఠశాలను ఎంపిక చేశారని పేర్కొన్నారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాల సాధన, విద్యార్థుల సంక్షేమానికి వినూత్న కార్యక్రమాలు, పాఠశాలలో 180 మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. వీటన్నింటి ఫలితంగా పాఠశాలకు అవార్డు వచ్చిందని తెలిపారు. కాగా, పాఠశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు రావడంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి అభినందనలు తెలిపారు.

గెస్ట్‌హౌస్ సిబ్బందిని సస్పెండ్ చేయండి

సింగరేణి జీఎంకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని సింగరేణి గెస్ట్ హౌస్ (ఇల్లెందు గెస్ట్ హౌస్) సిబ్బందిని సస్పెండ్ చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సింగరేణి జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కోడూరు శ్రీనివాసరావును ఆదేశించారు. పొంగులేటి శనివారం రాత్రి గెస్ట్‌హౌస్‌కు రాగా, నిర్వహణ, పరిశుభ్రత సక్రమంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక రికార్డులు తీసుకుని ఆదివారం కల్లూరు మండలంలోని నారాయణ పురం గ్రామానికి రావాలని సూచించగా.. జీఎం, డీజీఎం రికార్డులతో సహా మంత్రి నివాసానికి వెళ్లారు. ఈ క్రమంలో గెస్ట్ హౌస్ నిర్వహణ సరిగా లేదని, సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేయాలని ఆదేశించారు. దీంతో క్లర్క్ రాజశేఖర్‌ను సస్పెండ్ చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు.



- నేడు భోగి.. రేపు సంక్రాంతి
- పట్టణాల నుంచి పల్లెబాట పడుతున్న ప్రజలు
- ప్రయాణికుల రద్దీతో ఆర్టీసీ బస్టాండ్లు కిటకిట
- రంగవల్లులతో లోగిళ్లను తీర్చిదిద్దుతున్న మహిళలు
- కోడి పందేలకు సిద్ధమవుతున్న పలువురు

సంక్రాంతి సందడి షురూ..

భోగిమంటలు.. వాకిళ్ల ముందు గొబ్బెమ్మలు, అందమైన ముగ్గులు.. పిండి వంటల ఘుమఘుమలు.. గాలి పటాలతో చిన్నా, పెద్ద అంతా సందడే సందడి.. ఇవీ సంక్రాంతి సందర్భంగా జిల్లాలో చోటుచేసుకుంటున్న దృశ్యాలు. డూడూ బసవన్నల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో పల్లెలు మార్మోగనున్నాయి.

–చుంచుపల్లి/జూలూరుపాడు/కొత్తగూడెంటౌన్

పందెం కోడి.. రెడీ'

సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు కాసేందుకు పలువురు ఉవ్విళ్లూరుతున్నారు. అశ్వారావుపేట, చంద్రుగొండ, ములకలపల్లి, భద్రాచలం, జూలూరుపాడు, సుజాతనగర్, చర్ల, దుమ్ముగూడెం, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి మండలాల శివారు గ్రామాల్లో కోడి పందేల జోరు కినిపిస్తోంది. పందెం కోళ్ల కొనుగోళ్లు ఇంకా కొనసాగుతూనే ఉండగా.. జాతి, రంగును బట్టి రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు ధర పలుకుతున్నాయి.

అంతటా కోలాహలమే..

నాలుగైదు రోజులుగా జిల్లాలో ఎక్కడ చూసినా సంక్రాంతి కోలాహలమే కనిపిస్తోంది. విద్యాసంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు. సోమ, మంగళవారాల్లో భోగి, సంక్రాంతి రావడం, ముందురోజు ఆదివారం కావడంతో సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వచ్చేవారితో ఆర్టీసీ బస్సులు, రైళ్లు కిక్కిరిస్తున్నాయి. జిల్లా కేంద్రం కొత్తగూడెంలో వస్త్ర దుకాణాలు, పతంగులు, రంగులు, ఇతర సామగ్రి కొనుగోళ్లతో ఆయా షాపులు కిటకిటలాడుతున్నాయి. ఇక చిన్న పిల్లలున్న ప్రతీ ఇంట్లో భోగి పండ్ల వేడుక మరో ప్రత్యేకత. పెద్దవారు పిల్ల లకు భోగి పండ్లు పోసి ఆశీర్వదిస్తారు.

సంక్రాంతి.. రైతుల ఇళ్లలో కాంతి..

రైతులు పండించిన ధాన్యం, పత్తి, ఇతర పంటలు చేతికందగా మార్కెట్లలో విక్రయిస్తున్నారు. దీంతో డబ్బు అందుబాటులో ఉండడంతో ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు కొనుగోలు చేస్తుంటారు. ఇళ్లలో పిండి వంటలు ఘుమఘుమలాడుతుంటాయి. కనుమ రోజున దుక్కిటెద్దులు, పాడి పశువులకు పూలు, పసుపు, కుంకుమ, రంగులు అద్ది అందంగా ముస్తాబు చేస్తారు. అనంతరం గ్రామ శివారులో పశువులన్నింటినీ నిలిపి గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. ఇలా చేస్తే పశు సంపద వృద్ధి చెందుతుందని నమ్మకం. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దున ఉండటంతో అక్కడి సంప్రదాయాలు ఇక్కడా కనిపిస్తుంటాయి. మూడు రోజులు జరుపుకునే పండుగలో చివరి రోజు కనుమ సందర్భంగా మాంసాహార వంటలను ఇష్టపడతారు.

పెద్ద ముగ్గులు వేస్తాం



సంక్రాంతి పండుగను ఎంతో వైభవంగా జరుపుకుంటాం. కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతాం. భోగి, మకర సంక్రాంతి, కనుమ రోజున వాకిళ్లలో పెద్ద ముగ్గులు వేసి, రంగులు అద్ది గొబ్బెమ్మలను పెడతాం. రకరకాల పిండి వంటలు చేసుకుంటాం.

– కొర్సా నందిని, అనంతారం

మూడు రోజులూ పండగే



సంక్రాంతి పండుగను మూడు రోజులు జరుపుకుంటాం. భోగి, మకర సంక్రాంతి, కనుమ.. ఈ మూడు రోజులూ ఎంతో సంతోషంగా గడుపుతాం. అన్ని రకాల పిండి వంటలు చేస్తాం. భోగి మంటలతో పండుగ ప్రారంభం అవుతుంది. అమ్మాయిలకు ఓణీలను కట్టి వైభవంగా జరుపుతాం.

– బండ్ల సునీత, పాపకొల్లు

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక



సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తుంది. ప్రతీ ఇంట్లో ముగ్గులు, పిండి వంటలు, నోముల పూజలు చేసి సుఖసంతోషాలు కలగాలని దేవుడిని వేడుకుంటారు. ఈ మూడు రోజుల పండుగ అందరికీ ఆనందం నింపుతుంది.

– కంజర్ల మధుకుమారాచార్యులు, భజన మందిరం అర్చకుడు

అంజన్న సన్నిధిలో రామయ్యకు రాపత్తు సేవ



రామయ్యకు రాపత్తు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన
- పెద్ద ఎత్తున దర్శించుకున్న భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం రామయ్యకు రాపత్తు సేవ జరిగింది. బ్రిడ్జి సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో చైర్మన్ సుదర్శన్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ వేడుకగా స్వామి వారిని దేవస్థానం నుంచి తీసుకొచ్చి ఆశీనులు చేశారు.

స్వామివారికి అభిషేకం, సువర్ణ పుష్పార్చన..

దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారాన్ని పురస్కరించుకుని అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిత్యాన్నదానానికి విరాళం..

దేవస్థానం సన్నిధిలో జరిగే స్వామి వారి నిత్యాన్నదాన కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన మారెళ్ల వెంకటఅనిల్‌కుమార్, నమిత రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను తెలిపేందుకే..

- మూడు నెలల్లో 'దొడ్డి కొమురయ్య' సినిమా షూటింగ్ ప్రారంభం
- సెప్టెంబర్ 17న విడుదలకు సన్నాహాలు
- వివరాలు వెల్లడించిన డైరెక్టర్ సేనాధిపతి



మాట్లాడుతున్న డైరెక్టర్ సేనాధిపతి

ఇల్లెందు : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు అడుగంటుతున్న వేళ.. అమరవీరుల త్యాగాలను నేటి తరానికి పరిచయం చేసేందుకు తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్ర దర్శకుడు, మాటలు, కథా రచయిత సేనాధిపతి వెల్లడించారు. ఆదివారం ఆయన ఇల్లెందు కాకతీయనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ నటీనటులతో ఈ సినిమా తీస్తున్నట్లు తెలిపారు. సంగీతం, సాంకేతిక వర్గం అంతా తెలంగాణవాదులతోనే నిర్మిస్తున్నామని చెప్పారు. రూ.కోటి వ్యయంతో సినిమా తీయాలని అనుకుంటున్నామని, అందుకు 33 జిల్లాల నుంచి జిల్లాకు 26 మందిని సహ నిర్మాతలుగా ఎంపిక చేస్తామని వివరించారు. ఒక్కో సహ నిర్మాత రూ.10 వేలు పెట్టుబడి పెట్టేలా వారిని భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. మొత్తంగా వెయ్యి మంది సహ నిర్మాతలు ఉంటారని వెల్లడించారు. ఈ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేసి షూటింగ్ ప్రారంభిస్తామని, సెప్టెంబర్ 17న సినిమా విడుదల చేయనున్నామని చెప్పారు. తెలంగాణ వీరులను పరిచయం చేయడం కోసం అందరి సహాయంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. 234 బీసీ కులాలను ఈ చిత్ర నిర్మాణంలో కనిపించేలా సినిమా నిర్మించబోతున్నట్లు వివరించారు. రాబోయే కాలంలో చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కొమరంభీం జీవిత చరిత్రలను సైతం తెరకెక్కిస్తామని తెలిపారు. సమావేశంలో స్థానిక నేతలు కలసాని శ్రీనివాస్ యాదవ్, రామచందర్, రామారావు యాదవ్, మల్లేష్ యాదవ్, హరిప్రసాద్ యాదవ్, వీరభద్రం యాదవ్, నవీన్‌కుమార్, నారాయణ యాదవ్, రవీందర్, మేకల మల్లేష్ యాదవ్, గోచికొండ సత్యనారాయణ, బంధం నాగయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

భూవివాదాల పరిష్కారానికి కృషి

- రెవెన్యూ, అటవీభూముల సరిహద్దుల నిర్ధారణకు చర్యలు
- తొలి దశలో నియోజకవర్గానికి ఒక గ్రామంపై దృష్టి
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



రిటైనింగ్ వాల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్: రెవెన్యూ, అటవీ శాఖల నడుమ భూవివాదాల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా రెవెన్యూ, అటవీ భూముల్లో సమస్యల పరిష్కారం, రెవెన్యూ, ప్రైవేట్ వ్యక్తుల మధ్య భూవివాదాలపై సమీక్షించారు. అసైన్డ్ పట్టాలతో గత 40ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులకు ఇబ్బంది లేకుండా రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలని సచించారు. భూముల సర్వే కోసం ఆధునాతన సామగ్రిని సమకూరుస్తామని చెప్పారు. తొలుత ప్రతీ నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని వివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మంత్రి తెలిపారు. జిల్లాలోని 15సర్వే నంబర్లకు సంబంధించి 1,500ఎకరాల్లో రెవెన్యూ, అటవీ సరిహద్దు సమస్య ఉన్నందున పరిష్కరించాలని సూచించారు. కాగా, జిల్లాలో మైనింగ్ క్వారీల కోసం కేటాయించిన భూములు, వస్తున్న ఆదాయంపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కొన్నిచోట్ల అనుమతికి మించి భూముల్లో మైనింగ్ చేస్తుండగా, ఇంకొన్ని చోట్ల గడువు ముగిసినా తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇక నూతన రెవెన్యూ చట్టానికి సంబంధించి నిబంధనలు రూపొందించేందుకు అధికారులు సలహాలు ఇవ్వాలని మంత్రి తెలిపారు.

భూసేకరణ త్వరగా పూర్తిచేయండి

మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ త్వరగా పూర్తిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. అధికారులతో తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ మున్నేరు తీరం వెంట రూ.690కోట్లతో 17కి.మీ. మేర ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఖమ్మం రూరల్ మండలం వైపు 5.1 కి.మీ.లు, అర్బన్ మండలం మండలం వైపు 1.7 కి.మీ. ప్రభుత్వ భూమి ఉన్నందున పనులు చేపట్టాలని చెప్పారు. మిగతా భూసేకరణ పురోగతిపై ఎప్పటికప్పుడు వివరాలు అందించాలని, ప్రైవేట్ భూముల యజమానులతో చర్చించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో జూలై 15 నాటికి రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. ఈసమావేశాల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డీఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, ఆర్డీఓలు నర్సింహారావు, రాజేందర్, పాలేరు ప్రత్యేకాధికారి రమేష్, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, ఇరిగేషన్ ఈఈ అనన్య పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): భోగి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరని, దీంతో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి దరఖాస్తులు అందజేయడానికి కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

గిరిజన దర్బార్ కూడా..

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏలో ప్రతి సోమవారం నిర్వహించే గిరిజన దర్బార్‌ను నేడు రద్దు చేస్తున్నట్లు పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం భోగి సందర్భంగా సెలవు కావడంతో కార్యాలయ యూనిట్ అధికారులు అందుబాటులో ఉండరని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. గిరిజనులు ఈ విషయాన్ని గమనించి వినతుల సమర్పణకు రావొద్దని సూచించారు.

ఎదురుచూపులు ఎన్నాళ్లో ?



ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం

- సన్నరకం ధాన్యానికి పూర్తిగా అందని బోనస్
- ఇప్పటివరకు కొనుగోలు చేసింది 80,240 మెట్రిక్ టన్నులు
- బోనస్ చెల్లించింది రూ.13.58 కోట్లు
- బకాయిలు సుమారు రూ.18 కోట్లు

పాల్వంచరూరల్: వానాకాలంలో రైతులు సాగు చేసిన సన్నరకం వరి ధాన్యం ఆశించిన మేర దిగుబడి రాకున్నా.. ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడం కొంత ఊరటనిచ్చింది. కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని విక్రయించిన నాలుగైదు రోజుల వ్యవధిలోనే రైతుల అకౌంట్‌లో నగదు జమ చేస్తున్నా.. బోనస్ చెల్లింపుల్లో మాత్రం జాప్యం జరుగుతోంది. దీంతో తమకు బోనస్ ఎప్పుడు వస్తుందా అని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 160 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చింది. అయితే ఇప్పటివరకు సన్నరకం ధాన్యాన్ని విక్రయించిన వారిలో దాదాపు 50 శాతం మంది రైతులకు బోనస్ జమ కాలేదు. తాము ధాన్యం అమ్మి నెల కావస్తున్నా ఇప్పటికీ బోనస్ డబ్బు చెల్లించలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

బోనస్ సగం మందికే..

జిల్లాలో ఇప్పటి వరకు సగం మంది రైతులకు మాత్రమే బోనస్ జమ అయింది. ఇంకా సగం మందికి రూ.15 కోట్ల బోనస్ పెండింగ్‌లోనే ఉంది. నెల క్రితం ధాన్యం విక్రయించినా నేటికీ బోనస్ అందించలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోనస్ కోసం ఆశపడి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే తమకు నిరాశే మిగిలిందని అంటున్నారు.

12,820 మంది రైతుల నుంచి..


జిల్లాలో గతేడాది నవంబర్‌లో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 160 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఇప్పటివరకు 12,820 మంది రైతుల నుంచి రూ.185.91 కోట్ల విలువైన 80,240 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఇందులో 67,600 మెట్రిక్ టన్నులు సన్నరకం, 10,451 మె.టన్నుల దొడ్డు రకం ధాన్యం ఉందని వెల్లడించారు. అయితే 10,951 మందికి రూ.158 కోట్లు చెల్లించామని, మిగిలిన వారికి కూడా నేరుగా ఆయా రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు జమ అవుతుందని పేర్కొన్నారు.

4,215 మందికి బోనస్ జమ

ఇప్పటివరకు 67,600 మెట్రిక్ టన్నులు సన్నరకం, 10,451 మె.టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేశాం. సన్నరకం ధాన్యాన్ని విక్రయించిన రైతుల్లో 4,215 మందికి క్వింటాకు రూ.500 చొప్పున రూ.13.58 కోట్ల బోనస్ జమ అయింది. ధాన్యం కొనుగోలు చేశాక రైతుల వివరాల నమోదులో జాప్యం జరిగితేనే బోనస్ చెల్లింపులో ఆలస్యమవుతుంది.

– రుక్మిణి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి


నెలరోజుల క్రితం ధాన్యం అమ్మా..



మాది పాల్వంచ మండలం రెడ్డిగూడెం గ్రామం. నేను 40 క్వింటాళ్ల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో నెల రోజుల క్రితం విక్రయించాను. బోనస్ డబ్బు క్వింటాకు రూ.500 చొప్పున రూ.20 వేలు రావాల్సి ఉంది. నెల దాటినా ఇంత వరకు రాలేదు.

– వజ్జ మల్లమ్మ, రైతు


బోనస్ డబ్బులు చెల్లించాలి..



మాది రెడ్డిగూడెం గ్రామం. నేను 25 రోజుల క్రితం 85 క్వింటాళ్ల సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. నాకు రూ.41 వేలు బోనస్ రావాల్సి ఉంది. అయినా నేటికీ చెల్లించలేదు. ఇప్పటికైనా మా సమస్యలు చూసి వెంటనే బోనస్ చెల్లించాలి.

– కొనబోయిన బిక్షం, రైతు

రూ.44 వేలు రావాల్సి ఉంది..



నేను ధాన్యం కొనుగోలు కేంద్రంలో డిసెంబర్‌లో 88 క్వింటాళ్ల సన్న రకం ధాన్యం అమ్మాను. అందుకు రూ.44 వేల బోనస్ రావాల్సి ఉండగా ఇప్పటికీ చెల్లించలేదు. ఆ డబ్బు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నా.

– జక్కుల నరేష్, రైతు

క్లుప్తంగా

ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలు



సమ్మేళనంలో పాల్గొన్న ప్రముఖులు



వేడుకలకు కుటుంబ సభ్యులతో హాజరైన పూర్వ విద్యార్థులు

పినపాక: మండలంలోని ఈ బయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాఠశాల ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం సర్వోత్సవ వేడుకలు, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఐఆర్‌ఎస్‌లు వెంకటేశ్వరరెడ్డి, ప్రవీణ్ మాట్లాడుతూ పాఠశాల, గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు పాటుపడతామని చెప్పారు. పూర్వ ఉపాధ్యాయులు, ప్రస్తుత పాఠశాల ఉపాధ్యాయులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల కోసం నిరీక్షణ



కొత్తగూడెం బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

చుంచుపల్లి: సంక్రాంతి పండుగ వేళ సొంతూళ్లకు వెళ్తున్నవారికి ఆర్టీసీ బస్టాండ్లలో నిరీక్షణ తప్పడంలేదు. ప్రయాణికుల రద్దీకి తగినట్లు బస్సులు అందుబాటులో లేకపోవడంతో గంటలకొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సంఖ్యకు తగినట్లు సర్వీసులు ఏర్పాటు చేయకపోవడంతో అవస్థ పడుతున్నారు. పండుగలకు ప్రత్యేక బస్సులు పేరుకు మాత్రమే పెడుతున్నారు తప్ప ప్రయాణికులకు సౌకర్యంగా ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న కార్తీక్

తల్లాడ: నల్లగొండ జిల్లా కోదాడలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తల్లాడ మండలం నారాయణపురానికి చెందిన చిలమర్తి కార్తీక్ ప్రథమ స్థానంలో నిలిచాడు. హైదరాబాద్‌లోని ఏవీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఆయన పోటీల్లో సత్తా చాటాడు. నిరుపేద కుటుంబమైన చిలమర్తి జోజి – జ్యోతి దంపతుల కుమారుడైన కార్తీక్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించడంపై పలువురు అభినందించారు.

1983వ బ్యాచ్ కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 1983వ బ్యాచ్ ఉద్యోగులు

ఖమ్మంక్రైం: విజయనగరంలో శిక్షణ పొందిన 1983వ బ్యాచ్ పోలీస్ కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఖమ్మంలో నిర్వహించారు. ఈ బ్యాచ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న కానిస్టేబుళ్లు ఆ తర్వాత పదోన్నతిపై వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. ఈ మేరకు తమ బ్యాచ్‌లో మృతి చెందిన 12 మంది సహచరులకు సంతాపం తెలిపారు. అనంతరం శిక్షణ, విధి నిర్వహణలో జ్ఞాపకాలను పంచుకున్నారు. సీఐ వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఉద్యోగులు లక్ష్మీనారాయణ, రామారావు, సైదయ్య, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో శివలింగ ప్రతిష్ఠా మహోత్సవం

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో వందల ఏళ్ల కిందటి శివలింగ పురమ్మ దేవాలయాన్ని పునర్నిర్మించగా.. శివలింగ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జలాభిషేకం చేశారు. తొలుత స్వయంభూగా వెలిసిన శివలింగాన్ని దక్షిణ భాగాన ప్రతిష్ఠించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తులంతా పూజకు హాజరుకావడంతో సందడి నెలకొంది.

ప్రతీ మహిళకు సభ్యత్వం ఉండేలా..

- కొత్త పొదుపు సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశం
- ప్రత్యేక కార్యాచరణతో గ్రామాల్లో పర్యటిస్తున్న సెర్ప్ అధికారులు
- గ్రామంలో పదికి మించి సంఘాల ఏర్పాటుకు నిర్ణయం



పని ప్రదేశంలో అవగాహన కల్పిస్తున్న సెర్ప్ అధికారులు

ఇల్లెందురూరల్: గ్రామాల్లో ప్రతీ మహిళ పొదుపు సంఘాలంలో సభ్యత్వం కలిగి ఉండేలా సెర్ప్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. తక్కువ సంఘాలు ఉన్న గ్రామాల్లో కొత్త సభ్యులను చేర్చి, సంఘాల పెంచేందుకు కృషి చేస్తున్నారు. నూతన సభ్యులకు ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా సంక్షేమ, బ్యాంకు రుణం, ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు అందించేలా ప్రణాళిక రూపొందించారు.

కొత్త సంఘాల ఏర్పాటుపై కసరత్తు

గతంలో సుమారు పది మంది సభ్యులతో పొదుపు మహిళా సంఘం, పది అంతకంటే ఎక్కువ సంఘాలతో గ్రామసంఘాన్ని ఏర్పాటు చేశారు. చిన్న గ్రామాల్లో ఐదు గ్రూపులతో కూడా గ్రామసంఘాలను నెలకొల్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపించేది. మహిళా శక్తి పథకంలో భాగంగా చిన్న గ్రామసంఘాలు ఉన్న చోట పొదుపు సంఘాల సంఖ్య పెంచాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పది, అంతకంటే తక్కువ పొదుపు సంఘాలు కలిగి ఉన్న గ్రామాలు జిల్లాలో 135 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ, సమావేశాలు నిర్వహిస్తూ నూతన సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

పాత సంఘాల్లో సర్దుబాటు

2000 సంవత్సరంలో పొదుపు సంఘాల ఏర్పాటు ప్రారంభమైంది. నాటి నుంచి కొత్త సభ్యుల చేర్పింపు నిరంతర ప్రక్రియగా కొనసాగింది. 58 సంవత్సరాల వయసు దాటిన మహిళల సభ్యత్వాల రద్దు, పలువురి సభ్యుల మృతి, పెళ్లిళ్లు చేసుకుని అత్తవారి ఇంటికి వెళ్లడం, ఉపాధి పనులకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం వంటి కారణాలతో పలు సంఘాల్లో సభ్యుల సంఖ్య తగ్గింది. ఏర్పడ్డ ఖాళీల స్థానంలో సెర్ప్ అధికారులు కొత్త సభ్యులతో సర్దుబాటు చేశారు. దీంతో రెండేళ్లుగా నూతన సంఘాల ఏర్పాటు అవకాశం లేకుండా పోయింది. నూతన సభ్యులు కూడా కొత్త సంఘాల కంటే అప్పటికే కొనసాగుతున్న సంఘాల్లో చేరడంపైనే ఆసక్తి చూపుతున్నారు.

సభ్యులకు రుణం, బీమా

పొదుపు సంఘాల నూతన సభ్యులకు బ్యాంకు రుణాలు ఇప్పించేలా ప్రభుత్వం సెర్ప్ అధికారులను ఆదేశించింది. సభ్యులు రుణం తీసుకున్న తర్వాత సహజ మరణం పొందితే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు వరకు బీమా వర్తిస్తుంది. వ్యక్తిగతంగా రూ.3.50 లక్షల వరకు రుణం తీసుకునేందుకు కొత్త సభ్యులు అర్హులు అవుతారు. వ్యాపారం పట్ల ఆసక్తి చూపేవారికి అధికారులు శిక్షణ ఇప్పిస్తారు. ఇందిర మహిళా శక్తి పథకంలో భాగంగా అర్హతల ఆధారంగా రుణాలు ఇచ్చేందుకు సెర్ప్ అధికారులు ప్రణాళిక రూపొందించారు.

సర్వే జరుగుతోంది



పది అంతకంటే తక్కువ సంఘాలు ఉన్న గ్రామాలు జిల్లాలో 135 ఉన్నాయి. ఆ గ్రామాల్లో మహిళలతో సమావేశాలు నిర్వహించి నూతన సంఘాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా కొత్త సంఘాలకు కూడా రుణాలు మంజూరు చేస్తాం.

– రంగారావు, సెర్ప్ డీపీఎం

గురుకులాల్లో వేధింపులు, అవినీతి

- ఏడాది క్రితం విజిలెన్స్ విభాగం ఎత్తివేత
- ఆపై జాడే లేని ఖాపరమైన తనిఖీలు
- ఏసీబీని ఆశ్రయించాల్సిన దుస్థితిలో గురుకులాల టీచర్లు



ఇటీవల ఏసీబీకి ప్రిన్సిపాల్ పట్టుబడిన ఇల్లెందులోని మైనార్టీ గురుకులం

ఇల్లెందు: గురుకులాల్లో అక్రమాలు జరగకుండా పర్యవేక్షించేందుకు విజిలెన్స్ విభాగం గత పదేళ్ల పాటు తనిఖీలు చేపట్టేది. కారణాలేమిటో తెలియదు కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విజిలెన్స్ విభాగాన్ని ఎత్తివేసి శాఖాపరంగా తనిఖీలు చేస్తే సరిపోతుందని వెల్లడించారు. అయితే, ఈ తనిఖీలు అంతంత మాత్రంగానే కొనసాగుతుండడంతో పలు గురుకులాల్లో ప్రిన్సిపాళ్లు ఆడింది ఆట.. పాడింది పాట అన్నట్లు మారిందనే విమర్శలు వస్తున్నాయి. వీరి వేధింపులు తాళలేక కొన్నిచోట్ల ఉపాధ్యాయులు ఏసీబీని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈక్రమంలోనే ఇల్లెందు మైనార్టీ గురుకుల పాఠశాల (బాలుర) గెస్ట్ ఉపాధ్యాయురాలు సంధ్యారాణికి రావాల్సిన వేతనం బిల్లు చేసేందుకు ప్రిన్సిపాల్ భీమనపల్లి కృష్ణ వేధిస్తుండడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. దీంతో అటెండర్ రామకృష్ణకు రూ.2వేలు ఇవ్వగా ఆయన నుంచి ప్రిన్సిపాల్ తీసుకుంటుండగా తాజాగా ఏసీబీ అధికారులు పట్టుకోవడంతో కేసు నమోదైంది.

రిటైర్డ్ అధికారులతో...

గత పదేళ్ల పాటు గురుకులాల నిర్వహణ తీరును విజిలెన్స్ విభాగం తనిఖీ చేసింది. ఈ విభాగంలో పోలీసు శాఖతో పాటు సంక్షేమ శాఖల్లో రిటైర్డ్ అయిన అధికారులతో తాత్కాలిక పద్ధతిన నియమించేవారు. వీరి తనిఖీలో గురుకులాలలో జరిగే ప్రతీ అంశం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లి నివేదికల ఆధారంగా బాధ్యులపై చర్యలు ఉండేవి. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విజిలెన్స్ విభాగాన్ని తొలగించి సొంత శాఖ అధికారులే తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆపై ఇటీవల మండల స్థాయి అధికారులు మెనూ అమలును తనిఖీ చేయాలని సూచించారు. అయితే, అధికారులు కేవలం మెనూ వరకే తనిఖీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. కాగా, సిబ్బందిపై వేధింపులు, అవినీతిపై ఎవరూ దృష్టి సారించక కొందరు ప్రిన్సిపాళ్లు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఇక్కట్లు

గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేసే ఉద్యోగులు అష్టకష్టాలు పడుతున్నట్లు సమాచారం. ఏ రోజు ఎవరిని ఎందుకు తీసేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అదే పోస్టుపై ఆశతో ఉన్న ఇంకొందరు డబ్బులు ఇచ్చే చాలు పాత వారిని తొలగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే, ఏజెన్సీల బాధ్యులు అంతోఇంతో ముట్టచెబితే ఒకరి స్థానంలో మరొకరికి ఉద్యోగం కల్పిస్తున్నారు. ఒకవేళ పాత ఉద్యోగులే కొంత మేర చెల్లిస్తే ఉద్యోగం కొనసాగుతోందని తెలుస్తోంది. ఇక గురుకులాల్లో పనిచేసే ప్రతీ ఉద్యోగుల వేతన బిల్లులు ప్రిన్సిపాల్ నేతృత్వాన ప్రభుత్వానికి చేరతాయి. దీన్ని ఆసరా చేసుకుని పైఅధికారులను మచ్చిక చేసుకుంటున్న కొందరు ప్రిన్సిపాళ్లు వేధింపుల పర్వానికి తెర లేపుతున్నట్లు సమాచారం. శాఖాపరమైన తనిఖీలు నిర్ణీత సమయానికి నిర్వహించడమో లేక విజిలెన్స్ విభాగాన్ని పునరుద్ధరించడమో చేస్తే తప్ప గురుకులాల్లో సిబ్బంది సాఫీగా విధులు నిర్వర్తించే పరిస్థితి కానరావడం లేదని తెలుస్తోంది.

క్రమం తప్పక తనిఖీలు ఉండేవి..

గురుకులాల్లో తనిఖీలకు ఉన్న విజిలెన్స్ విభాగాన్ని గత ఏడాది ఎత్తివేశారు. ఈ విభాగం ఉన్నప్పుడు ప్రతీ మూడు నెలలకోసారి మైనార్టీ గురుకులాల్లో తనిఖీ చేసి మా దృష్టికి వచ్చిన అంశాలతో ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చేవాళ్లం. ఏ చిన్న లోపం ఉన్నా వెంటనే పరిష్కారమయ్యేది.

– కె. సీతారాములు, మాజీ విజిలెన్స్ అధికారి, ఖమ్మం

పీసీఆర్ ఎస్ఐపై కేసు నమోదు



రూరల్ పోలీసుస్టేషన్‌లో వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

పాల్వంచరూరల్: కారుతో ఆటోను ఢీకొన్న ఘటనలో పీసీఆర్ ఎస్ఐ రామారావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో జాతీయ రహదారి ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఈ నెల 10న రోడ్డు పక్కన ఆటో నిలిపి ఉంది. అదే సమయంలో కారులో పాల్వంచ వైపు వస్తున్న ఎస్ఐ రామారావు ఢీకొట్టాడు. దీంతో ఆటో వద్ద ఉన్న ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రుడి కుమారుడు ధర్మపురి పవన్‌కుమార్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

పోలీసుస్టేషన్‌లో వాగ్వాదం

కిన్నెరసానిలో ఉన్న రూరల్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావుకు, ఫిర్యాదుదారు ధర్మపురి పవన్‌కుమార్‌కు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఒకరినొకరు నెట్టివేసుకున్నారు. ఈ విషయమై ఏఎస్ఐ సుధాకర్‌ను వివరణ కోరగా.. స్వల్ప వివాదం జరిగిందని, సద్దుమణిగిందని తెలిపారు.

బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్‌పై దాడి

- అర్ధరాత్రి విధుల్లో ఉండగా ఘటన
- ముగ్గురు నిందితులపై కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: విధుల్లో ఉన్న బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్‌పై ముగ్గురు దాడి చేసిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ శేఖర్ నైట్ డ్యూటీ విధుల్లో భాగంగా రాత్రి వేళ పట్టణంలోని హనుమాన్ బస్తీ ప్రాంతానికి వెళ్లాడు. అదే సమయంలో ఎస్‌కేటీ అపార్ట్‌మెంట్ వద్ద ముగ్గురు యువకులు పవన్, ఉదయ్, ప్రమోద్ మద్యం తాగుతున్నారు. దీంతో ప్రశ్నించిన కానిస్టేబుల్ శేఖర్‌పై వాగ్వాదానికి దిగి దాడికి చేశారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. బాధిత కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ శివప్రసాద్ తెలిపారు. కాగా కానిస్టేబుల్‌పై దాడి చేసిన రౌడీ మూకలు నియోజకవర్గ ప్రజాప్రతినిధులను ఆశ్రయించి కేసు నమోదు కాకుండా ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. నిందితులు ఇసుక మాఫియాలో కీలకంగా వ్యవహరిస్తున్నారని, ఆ నేపథ్యంలోనే కానిస్టేబుల్‌పై దాడి జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. పోలీసు కానిస్టేబుల్‌కే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఒకదానికొకటి పలు వాహనాలు ఢీ

భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్



ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు



కొణిజర్లలో నిలిచిపోయిన వాహనాలు

కొణిజర్ల: ఓ లారీ ముందు వెళ్తున్న బస్సును ఢీకొట్టి, అదే వేగంతో మరో కంటైనర్ లారీని ఢీకొట్టింది. అంతేకాక బస్సు దాని ముందున్న లారీని, చెట్టును ఢీకొన్న ఘటన కొణిజర్ల సమీపాన ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఈ ఘటనతో రెండు వైపులా పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి ఫ్లైయాష్ లోడ్‌తో వస్తున్న లారీ.. హైదరాబాద్ నుంచి ఒడిశాలోని మల్కన్‌గిరికి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. ఆపై ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్ వాహనాన్ని సైతం ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ఘటనలో కంటైనర్ లారీల క్యాబిన్లు నుజ్జునుజ్జయ్యాయి. అంతేకాక లారీడ్రైవర్ ఓర్సు స్వామి, కంటైనర్ డ్రైవర్లు ఆరిఫ్‌ఖాన్, ధర్మేందర్‌యాదవ్‌కు గాయాలయ్యాయి. అయితే, లారీ ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రోడ్డు కిందకు దిగగా డ్రైవర్ ప్రదీప్ తిరిగి రహదారిపైకి చేర్చే క్రమాన చెట్టు కొమ్మను, ముందు ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టాడు. ఆ సమయాన బస్సులో 55 మంది ప్రయాణికులు ఉన్నా ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రాకపోకలకు అంతరాయం

రెండు లారీల క్యాబిన్లు నుజ్జునుజ్జయి ఇరుక్కుపోవడం.. రహదారిపై ఈ ఘటనతో జరగడంతో రెండు వైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పండుగ సమయాన స్వస్థలాలకు వెళ్తున్న వారి కార్లు, బస్సులు రెండు గంటల పాటు నిలిచిపోగా పోలీసులు చేరుకుని దెబ్బతిన్న వాహనాలను పక్కకు తప్పించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్, సీఐ సాగర్, ఎస్ఐ సూరజ్ ఘటనా స్థలానికి చేరుకుని పర్యవేక్షించారు.

గూడ్స్ రైలు ఢీకొని 13 గేదెలు మృతి



మృతి చెందిన గేదెలను బయటకు తీస్తున్న దృశ్యం

కారేపల్లి: పట్టాలు దాటుతున్న జీవాలను గూడ్స్ రైలు ఢీకొనగా 13 గేదెలు మృత్యువాత పడ్డాయి. కారేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు పెంపకందారులు తమ పాడిగేదెలను పెద్ద చెరువు సమీపంలోని బీడుకు తీసుకెళ్లేందుకు ఆదివారం ఉదయం రైల్వే ట్రాక్ దాటిస్తున్నారు. అదే సమయాన డోర్నకల్ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో 13 గేదెలు మృత్యువాత పడగా, మరో రెండింటికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో గూడ్స్ రైలు సుమారు రెండు గంటల పాటు నిలిచిపోయింది. రైల్వే సిబ్బందితో పాటు స్థానికులు గూడ్స్ రైలు కింద చెల్లాచెదురుగా పడిన గేదెల శరీర భాగాలతో పాటు చక్రాల కింద ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటికి తీసేందుకు శ్రమించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా పాడిపశువుల మృతితో సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని పెంపకందారులు వాపోయారు.

ఐఈడీ పేలి బాలికకు తీవ్రగాయాలు

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ బాంబ్ పేలి ఓ బాలిక తీవ్రగాయాల పాలైన ఘటన ఆదివారం జరిగింది. సుకుమా జిల్లా చింతల్నార్‌లోని తిమ్మాపూర్ గ్రామ అటవీప్రాంతంలో మావోయిస్టులు ఐఈడీ బాంబు అమర్చారు. తిమ్మాపూరం గ్రామానికి చెందిన బాలిక సోడి మల్లె కాలు వేయడంతో తీవ్రంగా గాయపడింది. బాలికకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బయటకు పంపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఘటనపై చింతల్నార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మిషన్ భగీరథ పైపులో పాము తొలగింపు

లీకేజీకి మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గాడ్రాల స్టేజీ సమీపంలో ఉన్న మిషన్ భగీరథ ఎయిర్ వాల్వ్ పైపులో దూరిన పామును అధికారులు తొలగించారు. ఆదివారం సాక్షి దినపత్రికలో 'మిషన్ భగీరథ పైపులో పాము' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ గ్రిడ్ సత్తుపల్లి డీఈఈ అభిషేక్ ఆదేశాలతో స్థానిక సిబ్బంది ఎయిర్ వాల్వ్‌లో ఉన్న పామును పూర్తిగా బయటకు తీశారు. నెల రోజులుగా ఎయిర్ వాల్వ్ వద్ద లీకేజీ ఏర్పడగా మరమ్మతులు చేపట్టారు.

పేకాట స్థావరంపై దాడి

చంద్రుగొండ: ఆరుగురు పేకాటరాయుళ్లను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌ఓ పాపయ్య కథనం ప్రకారం.. మండల పరిధిలోని రావికంపాడు గ్రామశివారు మిర్చి తోటలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ 1,240 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

ములకలపల్లి: కోడిపందేలు వేస్తున్న ఎనిమిది మందిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మండల పరిధిలోని తిమ్మంపేట శివారు కోడి పందేలు వేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. రూ.2 వేల నగదు, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు, నాలుగు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కానిస్టేబుళ్లు తిరుపతి, ధర్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

పండుగ సామగ్రి కోసం వెళ్లి..

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ఎట్టి నరేష్ (ఫైల్)

ఇల్లెందురూరల్: సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని సామగ్రి కొనుగోలు చేసేందుకు వెళ్లిన యువకుడు విగతజీవిగా ఇంటికి చేరాడు. మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన ఇర్ప నరేష్ (35) ఆదివారం పండుగ సామగ్రి కొనుగోలుకు బైక్‌పై ఇల్లెందుకు బయలుదేరాడు. మార్గమధ్యలో జెండాల వాగు సమీపంలో అటవీ ప్రాంతం నుంచి ఒక్కసారిగా గేదెలు రహదారిపైకి చేరాయి. దీంతో నరేష్ బైక్‌ను అదుపు చేయలేక గేదెలను ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో ఇల్లెందు నుంచి మహబూబాబాద్ వైపు వెళుతున్న లారీ అతని తలమీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాల్వంచ: మద్యం మత్తులో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు ఆదివారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కరకవాగుకు చెందిన జాల హరీష్(30) భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మద్యం మత్తులో ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు గమనించి ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రాఘవయ్య తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

సీసీ నిఘాలో పర్ణశాల పుణ్యక్షేత్రం

ప్రసాద్ పథకం ద్వారా 32 సీసీ కెమెరాల ఏర్పాటు



కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని పర్ణశాల గ్రామమంతా సీసీ కెమెరాల నిఘాలోకి రానుంది. గతంలోనే దేవస్థానం తరఫున 16 కెమెరాలు ఏర్పాటు చేయగా, ప్రసాద్ పథకంలో మరో 32 కెమెరాలను ఆలయ ప్రాంగణంతో పాటు గ్రామంలో ఏర్పాటుచేసే పనులు మొదలయ్యాయి. గ్రామంలోని సీతవాగు, పార్కింగ్, గోదావరి ఘాట్, ఆలయ రహదారి, ముందు, వెనుక భాగాలు, కొత్త, పాత కుటీరాల సమీపాన, కల్యాణ మండపం దగ్గర ఏర్పాటు చేయిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్ తెలిపారు. కాగా, కెమెరాలను భద్రాచలంలోని దేవస్థానం ప్రధాన కార్యాలయానికి అనుసంధానించి అక్కడి నుంచి అధికారులు పర్యవేక్షించనున్నారు. కాగా, కెమెరాల కాంట్రాక్టర్ రెండేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. వివిధ రాష్ట్రాల నుంచి పర్ణశాలకు భక్తులు వస్తుండగా చోరీలు సర్వసాధారణం కావడంతో ఇప్పుడు వీటిని అరికట్టే అవకాశం ఏర్పడుతుందని భావిస్తున్నారు. అలాగే, ఆలయ ఉద్యోగుల విధినిర్వహణ మరింత మెరుగుపడే అవకాశాలున్నాయి.

పెండింగ్ బిల్లులన్నీ విడుదల చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సత్తుపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న జీపీఎఫ్, సరెండర్ లీవ్, టీఎస్‌జీఎల్ఎల్ఐలతో పాటు రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుల గ్రాట్యుటీ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని పీఆర్టీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, బి.రవి డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో ఆదివారం జరిగిన పీఆర్టీయూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగుల ఇక్కట్లు తీర్చేలా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. అలాగే, సంక్రాంతి కానుకగా పెండింగ్ డీఏలను ప్రకటించి, హెల్త్‌కార్డులు, మెడికల్ బిల్లులు ఎస్టీఓల ద్వారా చెల్లింపు, పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దుపై నిర్ణయం వెలువరించాలని కోరారు. సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బజ్జూరి వెంకటేశ్వరరావుతో పాటు సంగమేశ్వరరావు, బానోతు శ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సాగు మడిలో కొంగల సందడి

సాగు మడిలో కొంగలు సందడి చేశాయి. వరి సాగు చేసేందుకు ఓ రైతు పొలం దున్నాడు. దీంతో భూమిలో ఉన్న పురుగులు నీటిలో తేలుతుండగా వందల సంఖ్యలో కొంగలు వచ్చి ఆరగించాయి. మండలంలోని దానుతండా సమీపంలో ఈ దృశ్యం కనిపించింది. – టేకులపల్లి